క్లుప్తంగా

పాఠశాలలో మందుబాబుల ఆగడాలు

నారాయణఖేడ్: తమ గ్రామ పాఠశాల భవనంలో రాత్రి సమయంలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని నిజాంపేట మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. పాఠశాల భవనానికి గేటు లేకపోవడం, బాత్రూంలకు తలుపులు లేకపోవడంతో రాత్రి సమయంలో మందుబాబులు పాఠశాలలో మద్యం సేవిస్తూ అసాంఘీక కార్యకలాపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామసుతలు కోరారు.

దాడులకు నిరసనగా కంగ్టి బంద్



ర్యాలీ నిర్వహిస్తున్న యువజన సంఘాల సభ్యులు

కంగ్టి(నారాయణఖేడ్): బంగ్లాదేశ్‌లో కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్న హిందువులపై దాడికి నిరసనగా శుక్రవారం స్వచ్ఛందంగా కంగ్టి బంద్ పాటించారు. పార్టీలకు అతీతంగా హిందువులపై దాడులను నిరసిస్తూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే సుభాష్‌చంద్రబోస్ క్రాంతి చౌక్‌లో వరకు ర్యాలీ తీశారు. హత్యలు ఆపండి, హిందువులను రక్షించండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువకులతో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): సీజనల వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవి ప్రజలను కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి వడపోసిన నీరు తాగాలన్నారు. జ్వరం ప్రారంభంలోనే వైద్యులను కలిసి మందులు వాడాలన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కంగ్టి మండలం నాగన్‌పల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలో శుక్రవారం కురిసిన వర్షానికి ఇల్లు వెనుక గోడ కూలింది. దీంతో బాధితురాలు కమలమ్మ తమకు ఉండడానికి ఇల్లు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుంటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఆడపిల్లలను గౌరవించడం అందరి బాధ్యత

సంగారెడ్డి ఎడ్యూకేషన్ : ఆడపిల్లలను గౌరవించడం ప్రతీఒక్కరి బాధ్యత అని శ్రీనివాస కల్యాణ చారిటబుల్ జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మంగళశాసనాలతో శ్రీ శ్రీనివాస కళ్యాణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, రక్షణ, పరిరక్షణలో భాగంగా ఆడపిల్లల్ని గౌరవించడం మన ఇంటి నుండే మొదలు పెట్టాలనే సత్ సంకల్పంతో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మా ఇంటి మహాలక్ష్మీలకు పసుపు బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీలక్ష్మి, నర్సమ్మ, జ్యోతి, ప్రియాంక, హర్షిత, అవనిత, అనురిత పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

జహీరాబాద్ టౌన్: ఐకమత్యంతో ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ జహీరాబాద్ అధ్యక్షుడు విఠల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సంఘం సర్వసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థకు ఏజెంట్లు మూలస్తంభాలన్నారు. ఏజెంట్లు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏజెంట్లు కలిసికట్టుగా ఉంటూ సమస్యలపై పోరాటం చేయాలని ఆయన కోరారు. సంఘం నూతన అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్న ఏజెంట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు సుభాష్, ప్రభు, శంకర్, ప్రభు, మాణిక్ ప్రభు, కిష్టన్న, సంగారెడ్డి, మాధవరావు, బస్వరాజ్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వరాల తల్లికి వందనం

శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లకు పూలు, పండ్లు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వరలక్ష్మి అమ్మవారి కృపా కటాక్షాలు ఉండి, సకల సౌభాగ్యాలు కలుగాలని కోరుకున్నారు.



రామచంద్రాపురం(పటాన్‌చెరు): అమ్మవారికి హారతి ఇస్తున్న కార్పొరేటర్ సింధు



జహీరాబాద్ టౌన్: శ్రీమాణిక్‌ప్రభు స్కూల్‌లో వరలక్ష్మి వ్రతం



హత్నూర(సంగారెడ్డి): షేర్‌ఖాన్‌పల్లి పలుగు పోచమ్మ ఆలయంలో..



సంగారెడ్డి టౌన్ : శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవి అలంకరణలో దుర్గాభవాని మాత



సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణం కన్యకాపరమేశ్వరి మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు



న్యాల్‌కల్(జహీరాబాద్): టేకూర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు



సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డిలో లక్ష్మీదేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వట్‌పల్లి(అందోల్): వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళ భక్తులు



మునిపల్లి(అందోల్): తాటిపల్లిలో వరలక్ష్మి వ్రతం నిర్వహించిన భక్తులు

పెద్దాస్పత్రి కిటకిట

వాతావరణంలో మార్పు చోటుచేసుకోవడంతో వ్యాధులు ముసురుకుంటున్నాయి. జిల్లాలో రోజురోజుకూ సీజనల్ ఫీవర్స్ పెరిగిపోతున్నాయి. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతూ జనాలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కొద్దిరోజులుగా వరుస పడుతున్న వానలతో వైరల్‌ఫీవర్స్ తో పాటు, డెంగీ కేసులు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయి. సంగారెడ్డి :

- పెరిగిన రోగుల తాకిడి
- విషజ్వరాల బారిన ప్రజలు
- ప్రతీరోజు 1500 నుంచి రెండు వేల ఓపీ

వారం పది రోజులుగా జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. పారిశుద్ధ్య లోపంతో సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో సర్కారు దవాఖానాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కొన్నిచోట్ల పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ ప్రాంతీయ దవాఖానాల్లో రోగుల తాకిడి అధికంగా ఉంది. జూన్ వరకు 500 నుంచి 1000 వరకు వచ్చే ఓపీ.. జులై ఒకటవ తేదీ నుంచి నిత్యం 1500 నుంచి 2 వేల మంది వరకు రోగులు వస్తున్నారు. ఇన్‌పేషెంట్లు 250 మంది వరకు ఉంటున్నారు. వీరిలో సీజనల్ వ్యాధులైన విష జ్వరాలు, అతిసారం, డెంగీ, టైఫాయిడ్ బారిన పడిన వారే ఎక్కువగా చికిత్స పొందుతున్నారు. మహిళలకు చెందిన 15వ వార్డులోనూ ఓపీ సంఖ్య భారీగా పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. సరిపడా వైద్యులు లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ, భోజనశాల అధ్వానంగా ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

మందులు అందుబాటులో..

అతిసారం, డెంగీ కేసులు అధికంగా లేకున్నప్పటికీ విషజ్వరాలు విజృంభిస్తున్నాయని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. రోగులకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వర్షాకాలం కావడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలుండకుండా చూడాలన్నారు. వేడి పదార్థాలనే తినాలన్నారు.
: డాక్టర్ అనిల్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ విభాగం

జిల్లాలో రోగుల వివరాలు (జులై నుంచి ఈ నెల 12 వరకు)	
జ్వర బాధితులు	:14,134
డెంగీ కేసులు	: 76
టైఫాయిడ్	: 276
శ్వాసకోశ వ్యాధులు	:1108
విరేచనాలు	: 2218
వాంతులు	: 478

సంగారెడ్డి ఆస్పత్రిలో..	
డెంగీ	:6
టైఫాయిడ్	: 1812
అతిసారం	:96
విష జ్వరాలు	:108

మా గ్రామాన్ని విలీనం చేయవద్దు



ఎంపీ శెట్కార్‌ను కలిసి విన్నవించుకుంటున్న హోతి(కె) ప్రజలు

జహీరాబాద్: మున్సిపల్ పరిధిలో తమ గ్రామాన్ని విలీనం చేయవద్దంటూ హోతి(కె) గ్రామ ప్రజలు ఎంపీ సురేష్ శెట్కార్‌ను కోరారు. గురువారం రాత్రి గ్రామస్తులు ఎంపీ శెట్కార్‌తో పాటు సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్‌లను కలిసి విన్నవించారు. విలీనం నుంచి మినహాయించేందుకు చట్ట సభల్లో తీర్మానం చేయించాల్సిందిగా కోరారు. ఇందుకు వారు స్పందిస్తూ ప్రజల నుంచి వచ్చిన విన్నపాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వార్డుల విభజన ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు.

బసవేశ్వరుడు అందరివాడు



ఎంపీ షెట్కార్‌ను సన్మానించిన జయదేవి మాత

జహీరాబాద్ టౌన్: బసవేశ్వరుడు అందరివాడని, ఆదర్శనీయుడని ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో మైసూరు మల్లేశ్వరీ దసోహ మఠం పీఠాధిపతి జయదేవి మాత ఎంపీని సన్మానించారు. పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆమె ప్రతి రోజు ప్రవచనాలను బోధిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి పట్టణానికి వచ్చిన ఎంపీ ఈ కార్యక్రమానికి హాజరుకాగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్ మాట్లాడుతూ బసవేశ్వరుడు అందరివాడని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. లింగాయత్ సమాజ్ అధ్యక్షకార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, సుభాష్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

కొండాపూర్(సంగారెడ్డి): అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి అర్హులకు కేటాయించాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అలియాబాద్‌లో వివిద దశల్లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు పాండు, అడివయ్య సందీప్ పాల్గొన్నారు.



నిర్మాణ దశల్లో ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న శ్రీధర్ తదితరులు

బాలికలను వేధిస్తే జైలు

– సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): మైనర్ బాలికలను వేధిస్తే జైలుకు పంపుతామని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలికలను ఎక్కడి తీసుకెళ్లినా, వారికి ఎవరైనా సహకరించినా.. శిక్ష తప్పదని తెలిపారు. యువత, చిన్న, పెద్ద తేడా లేకుండా మైనర్ అమ్మాయిల జోలికి వెళ్లడం, మాయ మాటలు చెప్పి వెంట పడుతున్నారని చెప్పారు. మైనర్ అమ్మాయిల జోలికి వెళ్తే పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్లు జైల్‌లో ఉండాల్సి వస్తదని వివరించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలపై ఫోన్, ఛాటింగ్ విషయంలో నిఘా ఉంచాలని సూచించారు.

ఫ్రైడే- డ్రైడేపై క్షేత్రస్థాయిలో అవగాహన

– ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): పరిశుభ్రత, స్వచ్ఛదనంపై గ్రామాల్లో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికి తిరిగి ప్రజలకు డ్రైడేపై అవగాహన కల్పించారు. మండలంలోని దామర్‌గిద్దా, బాన్సువాడ, జమ్గి(కే), జమ్గి(బీ) గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల ఎదుట నీరు నిల్వ ఉన్న బ్యారెళ్లు ఖాళీ చేయించి బ్లీచింగ్‌తో కడిగి తిరిగి నింపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఆశవర్కర్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం!

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణాల కోసం అనేక ప్రాంతాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. తవ్వకాలలో వచ్చిన పెద్ద పెద్ద రాళ్లను ప్రమాదకరంగా టిప్పర్లలో తరలిస్తున్నారు. ఈమార్గంలో తనిఖీలు కూడా లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారు. దీంతో వాహనదారుల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



టిప్పర్‌లో ప్రమాదకరంగా రాళ్ల తరలింపు



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న ఉమ్లాతండావాసులు



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఎమ్మెల్యేకు సన్మానం

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఉమ్లాతండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షిస్తూ ఉమ్లాతండావాసులు శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానించారు. గ్రామపంచాయతీగా ఏర్పాటవుతున్నందున ఉమ్లాతండాతో పాటు పరిధిలోకి చేర్చనున్న తండాలు సైతం అభివృద్ధి చెందుతాయని సంతోషం వ్యక్తం చేశారు. ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఉత్తమ కమిషనర్‌గా అవార్డు, ప్రసంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. మరిన్ని ఉత్తమ సేవలు అందించి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కౌన్సిలర్లు మాజీద్, నర్సింలు, సంధ్యారాణి రామకృష్ణ, హన్మాండ్లు పాల్గొన్నారు.

• చెరువును తలపిస్తున్న రోడ్డు



చెరువును తలపిస్తున్న గంగ్వార్ రోడ్డు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది చెరువో, కుంటనో అనుకుంటే పప్పులో కాలేసినట్లే! ఇది న్యాల్‌కల్ మండల పరిధిలోని అల్లాదుర్గం–మెటల్‌కుంట రోడ్డు. గంగ్వార్, హద్నూర్, ముంగి తదితర ప్రాంతాల్లో రోడ్డుపై బీటీ లేచిపోయి పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల గుంతల్లో నీరు నిల్చొని రోడ్డు చెరువులా మారుతుంది. శుక్రవారం కురిసిన వర్షానికి గంగ్వార్ వద్ద గుంతలో నీరు నిల్చొని చెరువులా కనిపించింది.

– న్యాల్‌కల్(జహీరాబాద్):

సంక్షిప్త వార్తలు

◆ బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని దుద్యాల రోడ్డు నుంచి మేడికుందా తండా మీదుగా మంచిర్యాలతండా వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మాజీ స్కోర్ చైర్మన్ సంగమేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ జానయ్య, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, రమేశ్, సంగారెడ్డి, అశోక్‌గౌడ్, మాజీ ఎంపిటీసీ విఠల్ నాయకులు పెద్దన్న, కచూర్‌రావు, విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ వ్యక్తి అదృశ్యం

రామచంద్రాపురం (పటాన్ చెరు): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలో నివాసముండే రాము లింగంపల్లిలో ఫుట్వేర్ పనిచేస్తాడు. మద్యానికి బానిసైనా ఇతను పని చేయకుండా ఇంట్లోనే ఉండడంతో ఈనెల 14వ తేదీన కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. అదేరోజు రాత్రి రాము తన ఫోన్‌ను ఇంట్లో పెట్టి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, మిత్రుల వద్ద అతని గురించి ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ బీకేఎస్ అధ్యక్షుడిగా మహేష్‌బాబు

పుల్‌కల్(అందోల్) : పుల్‌కల్ మండల భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా జీల్లా మహేశ్ బాబు(పుల్‌కల్), ఉపాధ్యక్షుడిగా రాములు(ఎస్.ఇటిక్యాల), ప్రధానకార్యదర్శిగా కిషన్ గౌడ్(పోచారం), సంయుక్త కార్యదర్శిగా సుభాష్‌రెడ్డి(ముదిమాణిక్యం), కార్యదర్శిగా దుర్గయ్య(మంతూర్), సభ్యులుగా కలాలి గంగారాం, బండారు నర్సింహులు, పీజీ బీరయ్య, దస్తయ్య, రమేశ్, ఓం సింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ నేడు శని త్రయోదశి పూజలు

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర, జేపీ కాలనీలోని పంచముఖి హనుమాన్ దేవస్థానంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం శనీశ్వర స్వామికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు మహేష్, నరేష్ తెలిపారు.

◆ నేటి నుంచి సప్తహ మహోత్సవం



రాయికోద్(అందోల్): మండలంలోని జంమ్గి గ్రామంలోని పాండురంగ విఠలేశ్వర ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి 24 వరకు సప్తహ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 17న ఉదయం అధిష్టాన పూజతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. వేడుకల్లో భాగంగా ప్రతీరోజు గాదా భజన, ప్రవచనములు, ,హరి కీర్తన, భజన కీర్తనలు ఉంటాయన్నారు. నిత్యం భక్తులకు అన్నదాన ఏర్పాటు ఉంటుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : రజిత

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ, పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కోరారు. పాత డబ్బాల్లో, టైర్లల్లో నీరు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్ సాంబరాజు, జవాన్లు సారయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.